ఘనంగా ఫాదర్ కొలంబో శత జయంతి వేడుకలు

ధర్మసాగర్‌లో గ్రామీణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం

మానవ సేవయే మాధవ సేవగా భావించిన మహనీయుడు కొలంబో ఫాదర్ విజయ్ పాల్ రెడ్డి

ధర్మసాగర్/మార్చి 15(జర్నలిస్ట్ వార్త):
ప్రముఖ సేవామూర్తి ఫాదర్ కొలంబో 100వ జయంతి వేడుకలు ఆదివారం ధర్మసాగర్ మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఫాదర్ కొలంబో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని వరంగల్ మెత్రాసనా పాలనాధికారి ఫాదర్ విజయ్ పాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.
అనంతరం జరిగిన సభలో ఫాదర్ విజయ్ పాల్ రెడ్డి మాట్లాడుతూ ఫాదర్ కొలంబో తన జీవితాంతం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ముఖ్యంగా పేదలకు విద్య, వైద్యం అందించడానికి అంకితమయ్యారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామీణ ప్రజలకు చేరువలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ మానవతా దృక్పథంతో సమాజ సేవలో ముందున్న వ్యక్తి కొలంబో అని స్మరించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందని ద్రాక్షలా మారకూడదనే ఉద్దేశంతో ఆయన పేరిట ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.
ఈ కార్యక్రమంలో ఫాదర్ కొలంబో మెడికల్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ఫాదర్ తరుణ్ రెడ్డి, మెడికేర్ హాస్పిటల్ డైరెక్టర్ ఫాదర్ చిన్నపరెడ్డి, విచారణ గురువులు ఫాదర్ సుధాకర్, వంగలపల్లి సర్పంచ్ భూక్యా మేనక, కరుణాపురం సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్, పెద్దపెండ్యాల సర్పంచ్ తోట నాగరాజు, ధర్మాపురం సర్పంచ్ బొమ్మినేని రమాదేవి,నష్కల్ సర్పంచ్ రాజు యాదవ్,ఉప సర్పంచులు, గ్రామ పెద్దలు మరియు విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, 40% పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

ట్రెంగ రాష్ట్ర అధ్యక్షులు కొండమల్ల రవి

హన్మకొండ/మార్చి15(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండమల్ల రవి డిమాండ్ చేశారు. ఆదివారం హన్మకొండలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో జరిగిన సంఘం అత్యవసర సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న జాప్యం వల్ల వేలాది మంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం తరపున ప్రభుత్వం ముందు పలు కీలక డిమాండ్లను ఉంచారు. 2023 జూలై నుండి అమలు కావాల్సిన పి ఆర్ సి ని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి. 5శాతం మధ్యంతర భృతి ఏమాత్రం సరిపోదని, 40శాతం తగ్గకుండా ఫిట్‌మెంట్ ప్రకటించి, బకాయిలను (ఏరియల్స్) వేతనంతో కలిపి ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేకుండా, అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో నగదు రహిత, పరిమితి లేని వైద్య సేవలు అందించాలి. 2024 జనవరి నుండి 2026 జనవరి వరకు పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను తక్షణమే విడుదల చేయాలి.
రెండేళ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఉద్యోగికి వెంటనే బదిలీలు చేపట్టాలి. ముఖ్యంగా 317 జీవో బాధితులను వారి స్వంత జిల్లాలకు తీసుకురావాలి. రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన పెన్షన్ ప్రయోజనాలు, జీపీఎస్
లోన్లు, సరెండర్ లీవ్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలి.
గ్రామ సేవకులుగా పనిచేసి పదోన్నతి పొందిన వారిని అదే మండలంలో కాకుండా, వేరే డివిజన్లలోని మండలాలకు బదిలీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన వారికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ట్రెంగ రాష్ట్ర ఉపాధ్యక్షులు భుక్య నరసింహ నాయక్, జనగామ జిల్లా అధ్యక్షులు మట్టపెల్లి వెంకటేశ్వర్లు, హన్మకొండ జిల్లా అధ్యక్షులు మరుపట్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మేకల రమేష్, కల్చరల్ సెక్రటరీ బోగం రాంచందర్ మరియు ఇతర ఉద్యోగ ప్రతినిధులు పాల్గొన్నారు.